ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 2 ఆగస్టు 2024

కావేరిలోకి 'మెట్టూరు' నీరు

● దిగువ ప్రాంతాల్లో అప్రమత్తం



ప్యారీస్, ఆగస్టు 1: సేలం జిల్లా మెట్టూరు డ్యాం నుంచి గురువారం ఉదయం 2 లక్షల ఘనపుటడుగుల నీటిని కావేరి నది కాలువలోకి విడుదల చేశారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా అక్కడ డ్యాంలు పూర్తిస్థాయిలో నిండి పొంగి పొర్లుతుండడంతో మిగులు జలాలను కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. మేట్టూరు డ్యాంకు వస్తున్న 2 లక్షల ఘనపుటడుగుల నీటిని అలాగే 16 గేట్లు ఎత్తి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో సేలం జిల్లా కలెక్టర్ బృందాదేవి జలవనరులు, ప్రజాపనుల శాఖల ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో కలసి పరిశీలించారు. మరోవైపు కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కర్ణాటక రాష్ట్రంలోని డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. అక్కడున్న కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల నుంచి మిగులు జలాలు విడుదల చేస్తున్న కారణంగా కావేరి నదిలో వరద ఉధృతి ఏర్పడింది. మెట్టూరు డ్యాంకు గత నెల 16వ తేది నుంచి వస్తున్న నీటి పరిణామం క్రమక్రమంగా పెరిగింది. ప్రారంభంలో 43 అడుగులున్న డ్యాం నీటి మట్టం 27వ తేది వందడుగులకు చేరింది. దీంతో డెల్టా జిల్లాకు మరుసటిరోజు నుంచి సాగునీరు విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ, డ్యాంకు చేరుతున్న నీటి పరిమాణం పెరుగుతుండడంతో మేట్టూరు డ్యాం పూర్తిసామర్థ్యం 120 అడుగులకు చేరింది. ఈ డ్యాం చరిత్రలో 43వ సారిగా 120 అడుగులకు చేరి రికార్డు నెలకొల్పింది. డ్యాంలో ఉన్న 16 గేట్లు ఎత్తేసి బుధవారం సాయంత్రం నుంచి వస్తున్న నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత గురువారం ఉదయానికి విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని 2 లక్షల ఘనపుటడుగులకు అధికారులు పెంచారు. ఇదిలా ఉండగా, కావేరి పరీవాహక డెల్టా జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. నీటిలో దిగి స్నానం చేయడం, బట్టలు ఉతకడం, సెల్ఫీ దిగడం ప్రమాదకరమని జిల్లా యంత్రాంగం, మున్సిపాలిటీలు సంయుక్తంగా లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తున్నాయి. ధర్మపురి జిల్లా హొగెనేకల్‌కు బుధవారం ఉదయం 1.20 లక్షల ఘనపుటడుగుల నీరు చేరిన నేపథ్యంలో, గురువారం ఉదయం 9 గంటలకు 1.70 లక్షలు, సాయంత్రానికి 2 లక్షల ఘనపుటడుగులకు చేరింది. డెల్టా జిల్లాల్లోని తీరప్రాంతాల్లో అగ్నిమాపక శాఖ, గజ ఈతగాళ్లు, పోలీసులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది.

16 జిల్లాలకు వర్షసూచన

వేళచ్చేరి, ఆగస్టు 1: రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నీలగిరి, కోవై జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ప్రకటించింది. రానున్న 24 గంటల్లో తిరువారూరు, దిండుగల్, సేలం, ధర్మపురి, కళ్లకుర్చి, విల్లుపురం, కడలూరు, తిరువణ్ణామలై, అరియలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తేని, తంజావూరు, పుదుకోట తదితర జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

ప్యాకెట్లలో రేషన్ సరుకులు

● సేలం జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు



ప్యారీస్, ఆగస్టు 1: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులను ప్యాకెట్లలో ఇచ్చే పథకానికి తమిళనాడు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చౌక దుకాణాల ద్వారా ప్రతినెలా వినియోగదారులకు బియ్యం, చక్కెర, గోధుమ, కందిపప్పు, పామాయిల్ తదితరాలను అందిస్తోంది. ఈ రకంగా ఇస్తున్న సరుకులను కొంతమంది రేషన్ దుకాణాల సిబ్బంది బ్లాక్ మార్కెట్లకు తరలించి ఆర్థికంగా లబ్ధిపొందుతున్నట్లు పలువురు రేషన్‌కార్డుదారులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మరోవైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న సంఘటనలు కూడా రాష్ట్రవ్యాప్తంగా రోజూ వెలుగుచూస్తున్నాయి. అందువల్ల ఈ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది. రేషన్ సరుకుల అక్రమ తరలింపు, ప్రైవేటు స్థలాల్లో భారీస్థాయిలో నిల్వ ఉంచడం, ఇందుకు సహకరించిన వారిపై ఆహార భద్రతా చట్టం 1955లోని నిబంధనల మేరకు కేసు నమోదుచేసి శిక్ష విధించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాకుండా, రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ విధానంతో కూడిన ఈ-ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కల్పించింది. గోదాముల నుంచి చౌక దుకాణాలకు రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. రేషన్ సరుకులను ప్యాకెట్లలో నింపి పంపిణీ చేసే పథకం కూడా ట్రయల్ రన్‌గా 234 నియోజకవర్గాల్లో తలా ఒక రేషన్ దుకాణం ద్వారా అమలు చేయనున్నారు. పైలెట్ పథకంగా సేలం జిల్లాలోని ఓ రేషన్ దుకాణంలో ప్రస్తుతం ప్యాకెట్లలో నింపిన రేషన్ సరుకులు ప్రజలకు అందిస్తున్నారు. ఈ విధానం క్రమక్రమంగా అన్ని జిల్లాలకు విస్తరింపజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

కేంద్రం వరద సాయం

రూ.150 కోట్లు



వరద నీటిలో నగరం (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో వరద నివారణ చర్యల కోసం కేంద్రప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. గత యేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు చెన్నై నగరం నీట మునిగిన విషయం తెల్సిందే. నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమైపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వరద నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగా 'అర్బన్ ఫ్లడ్ మిటిగేషన్ ప్రాజెక్టు' కోసం రూ.561.29 కోట్లను కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ ఫ్లడ్ మిటిగేషన్ ప్రాజెక్టు కోసం తొలిదశలో కేంద్రం రూ.150 కోట్లుకేటాయించింది. జాతీయ విపత్తుల నిర్వహణా సంస్థ కింద ఈ నిధులను ఇచ్చింది. నగరంలోని చిన్న చిన్న మురుగు నీటి కాల్వలను ప్రధాన కాలువలతో అనుసంధానం చేయడం, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలబడకుండా తగిన నిర్మాణాలు చేపట్టడం వంటి పనులను చేపడుతారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెన్నై నగరంలో చేపట్టిన వివిధ రకాల నిర్మాణ పనులు ఈశాన్య రుతుపవనాలు రాకముందే పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా తిరువిక నగర్, కొళత్తూరు, గెరుగంబాక్కం ప్రాంతాల్లోని కాలువల్లో వరద నీటి ప్రవాహాన్ని తగ్గించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. మనపాక్కం, నత్తంబాక్కం ప్రాంతాల్లో కూడా వరద నీటి ఉధృతిని తగ్గించేలా పనులు సాగుతున్నాయి. కొరట్టూరు ఉపరితల కాలువల్లో నీటి ప్రవాహం పెరిగేలా కాల్వల సామర్థ్యం పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మనలి, సాత్తాన్‌కుళం, మాధవరం సహా ఎనిమిది ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహ ఉధృతి నివారించేలా నిర్మాణాలు చేపట్టినట్టు ఆ ప్రాజెక్టు అమలు అధికారులు వెల్లడించారు.





భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

రూ.47 కోట్లతో పోలీస్ క్వార్టర్స్

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

అడయార్, ఆగస్టు 1: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.47 కోట్ల తో నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ప్రారంభించారు. సచివాలయం నుంచి ఈ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డీఎంకే సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2021 నుంచి ఇప్పటివరకు పోలీస్ క్వార్టర్స్‌తో పాటు పోలీస్ స్టేషన్లు, అగ్నిమాపక కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో 2021 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.454.63 కోట్ల వ్యయంతో 2733 పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. రూ.43.60 కోట్లతో 41 పోలీస్ స్టేషన్లకు పక్కా భవనాలు, రూ.69.83 కోట్ల వ్యయంతో పోలీస్ శాఖకు అవసరమైన అనుబంధ నిర్మాణాలను పూర్తి చేశారు. అదేవిధంగా రూ.55.19 కోట్లతో 'ఉంగల్ సొంతం' అనే పేరుతో 253 గృహ భవన సముదాయాలను నిర్మించారు. ఇందులో భాగంగా తిరుచ్చి జిల్లా జంబునాథపురంలో రూ.3.97 కోట్లతో నిర్మించిన 29 పోలీస్ క్వార్టర్స్‌ను, ఉరైయూరులో రూ.3.1 కోట్లతో 24 పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. చెన్నై జిల్లా టీపీ సత్రంలో రూ.3.70 కోట్లతోనూ, పుదుకోట జిల్లా రఘునాథపురంలో రూ.78.18 లక్షలతో, తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడిలో రూ.1.6 కోట్లతోనూ, తిరుచ్చి జిల్లా బీమానగర్‌లో రూ.2.70 కోట్లతో భవన సముదాయాలు, పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మించారు. తాజాగా, చెంగల్పట్టు జిల్లా మేలక్కోట, తెన్‌కాశి తదితర ప్రాంతాల్లో రూ.47.51 కోట్లతో నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ సహా, పోలీస్ స్టేషన్ భవనాలను సీఎం స్టాలిన్ ప్రారంభించారు.

కేంద్రంపై వామపక్షాల ఆగ్రహం

నిరసనగా ధర్నా ● 600 మంది అరెస్ట్



ధర్నాలో జి.రామకృష్ణన్ (సీపీఎం), ముత్తరసన్ (సీపీఐ) తదితరులు

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడును విస్మరించడాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గురువారం సీపీఎం, సీపీఐ, వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా కోయంబత్తూర్ కలెక్టరేట్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట వామపక్షాల నేతలు, కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు జి.రామకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ధర్నా సందర్భంగా కోవై డిప్యూటీ కమిషనర్ రవికుమార్, సీఐ అర్జున్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు. ధర్నాలో భాగంగా కార్యకర్తలు బీఎస్ఎన్‌ఎల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో, ఆగ్రహించిన కార్యకర్తలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రౌండ్ ఠానా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వారించినా వినకపోవడంతో ఆ సమయంలో కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని వాహనాల్లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం నేత రామకృష్ణన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ బడ్జెట్, పేదలు, మధ్యతరగతి ప్రజలను బాధించేలా ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఎన్డీఏకు మద్దతు ఇస్తున్న రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు హైకోర్టులో ఊరట

● ఆర్పీ పరమశివంకు జరిమానా, శిక్ష తగ్గింపు



పరమశివం

ప్యారీస్, ఆగస్టు 1: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే కేసులో అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ పరమశివంకు విధించిన నాలుగేళ్ల జైలుశిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పునిచ్చింది. 1991, 1996 సంవత్సరాల్లో చిన్నసేలం నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఆర్పీ పరమశివం, ఆదాయానికి మించి రూ.28.76 లక్షలు అధికంగా సంపాదించారని విల్లుపురం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆయనపై 1998లో కేసు నమోదుచేశారు. పరమశివం, ఆయన భార్య పూంగొడికి వ్యతిరేకంగా దాఖలుచేసిన ఈ కేసు విల్లుపురం ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసులపై విచారణ జరుపుతున్న ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా, 2017 పరమశివం భార్య పూంగొడి అనారోగ్యం కారణంగా మరణించారు. దీంతో ఆమె పేరును న్యాయస్థానం కేసు నుంచి తొలగించి, పరమశివానికి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.33,04,168 జరిమానా విధించింది. అంతేకాకుండా ఆయనకు సంబంధించిన ఆస్తులు జప్తుచేసి ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా ప్రత్యేక న్యాయస్థానం 2021 మార్చిలో తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ పరమశివం మద్రాసు హైకోర్టులో అప్పీలుకు వెళ్లారు. హైకోర్టు న్యాయమూర్తి జి.జయచంద్రన్ సమక్షంలో ఈ కేసు విచారణకు రాగా, ఏసీబీ తరఫున హాజరైన ప్రభుత్వ న్యాయవాది ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపించారు. గురువారం విచారణ పూర్తికావడంతో పరమశివం ఆస్తులు జప్తుచేయాలంటూ ప్రత్యేక కోర్టు జారీచేసిన ఉత్తర్వులను న్యాయమూర్తి జయచంద్రన్ రద్దు చేయడంతో పాటు నాలుగేళ్ల జైలుశిక్షను రెండేళ్లకు తగ్గించారు. జరిమానాను రూ.33 లక్షల నుంచి రూ.26 లక్షలకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఐఏ తనిఖీలు

● ఐదేళ్ళుగా అజ్ఞాతంలో వున్నవారి కోసం గాలింపు

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు రాష్ట్రంలోని 25 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పీఎంకే నేత హత్య కేసుకు సంబంధించి ఐదేళ్ళుగా అజ్ఞాతంలో ఉంటున్న ఐదుగురు నిందితుల ఆచూకీ కోసం వారు ఆరా తీశారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని తిరుభువనం మేలతూండిల్ వినాయక పేట ప్రాంతానికి చెందిన పీఎంకే నేత రామలింగం మతమార్పిడులను తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఈ క్రమంలో ఆయన్ని 2019 ఫిబ్రవరి 5న గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. దీనిపై పోలీసులు పలువురు నిందింతులను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను ఎన్ఐఏకు బదిలీ చేశారు. అయితే, ఈ కేసుతో సంబంధం ఉన్న ఐదుగురు నిందితుల ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో నిషేధిత పాపులర్ ఫ్రాండ్ ఆఫ్ ఇండియాకు చెందిన కార్యకర్తలకు సంబంధం ఉండొచ్చని ఎన్ఐఏ భావిస్తోంది. ఈ అనుమానితుల ఫొటోలను కూడా రిలీజ్ చేసి వారి కోసం ముమ్మరంగా గాలిస్తోంది. అదేసమయంలో ఈ నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రివార్డు కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి గురువారం జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు రాష్ట్రంలోని తిరుచ్చి, తంజావూరు, తిరువారూర్, మైలాడుదురైతో సహా 25 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కుంభకోణంలోని మేలక్కావేరి కేఎంఎస్‌లో ఉన్న మహమ్మద్ యూసఫ్ ఇంటికి వెళ్ళిన ఎన్ఐఏ అధికారులు ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే, మహమ్మద్ ఫైజల్, సహాబుద్దీన్, తాహిద్, ఇంతియాజ్ ఇళ్లల్లో కూడా సోదాలు చేశారు. మైలాడుదురై జిల్లాకు రెండు బృందాలుగా వెళ్ళిన ఎన్ఐఏ అధికారులు.. నిషేధిత పాపులర్ ఫ్రాండ్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి నవాజ్ ఖాన్, ఈ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఫైజల్ నివాసాల్లో తనిఖీ చేశారు. ఇదేవిధంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసిన అధికారులు గత ఐదేళ్ళుగా ఆచూకీ లభించని వారి కోసం ఆరా తీశారు. కాగా ఒకేరోజు ఇన్ని ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టడంతో కలకలం రేగింది.

రాష్ట్రంలో పెరుగుతున్న చికున్‌గున్యా

ఇప్పటికే 330 మంది బాధితులు



అడయార్, ఆగస్టు 1: రాష్ట్రంలో చికున్ గున్యా జ్వరపీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఈ యేడాది జూన్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 330 మందికి పైగా చికున్ గున్యా బారినపడినట్లు అధికారికంగా వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. పైగా జ్వరం నిర్ధారణ కోసం ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇంటి పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారిపోతున్నాయి. ఈ చిత్తడి నేలల్లో పెరిగే దోమలు చికున్‌గున్యాతో డెంగీ, మలేరియా జ్వరాలకు ప్రధాన కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఎడిఎస్ అనే రకం దోమ కుట్టడం వల్ల చికున్‌గున్యా, డెంగీ జ్వరం సోకుతుంది. ఈ జ్వరం బారినపడిన వారికి తీవ్రమైన జ్వరంతో పాటు తలనొప్పి, వళ్లు, మోకాళ్ళ నొప్పులు, కడుపునొప్పి, వాంతులు, శరీరం నీరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరికొందరికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు కూడా వస్తుంటాయి. ఈ జ్వరం మరింతగా ఎక్కువైన పక్షంలో శరీరం నుంచి రక్తం కూడా వస్తుంది. అందువల్ల చికున్ గున్యా లక్షణాలతో బాధపడేవారు తక్షణం వైద్యుడిని సంప్రదించి తగిన వైద్యం చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా చికున్ గున్యా బారిన పడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ యేడాది జూన్ వరకు మొత్తం 1451 మందిలో చికున్‌గున్యా లక్షణాలు కనిపించగా, వారిలో 331 మందికి ఈ జ్వరం సోకినట్టు నిర్ధారణ అయింది. గత నాలుగేళ్ళ కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈ జ్వరపీడితుల సంఖ్య ఈ యేడాది పెరుగుతోందని, అయినప్పటికీ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చికున్ గున్యా లక్షణాలు కనిపించినపక్షంలో తక్షణం వైద్యుడిని సంప్రదించి తగిన వైద్యం చేయించుకోవాలని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి. అదేసమయంలో మలేరియా, అంటు వ్యాధుల విభాగాల సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి జ్వరాలకు కారణమైన దోమల నిర్మూలనా చర్యలు చేపడుతున్నారు.

సమాచార ధ్వని

పరిశోధన ప్రాజెక్ట్‌లో ఉద్యోగ అవకాశాలు

ఐసిఎఫ్, ఆగస్టు 1: రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశోధన ప్రాజెక్ట్‌లో పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టుకు రూ.65,000 వేతనం, రూ.10,000 అలవెన్స్ ఇస్తారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తీర్ణులై, తమిళం రాయడం, చదవడం తెలిసిన వారు ఈ నెల 6 నుంచి 26వ తేదిలోపు www.tn.gov.in/tncmfp, www.bim.edu/tnc-mfp అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పరిశోధన కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 1: చరిత్ర, సాంఘిక విజ్ఞానం, తమిళ శాఖల్లో పరిశోధన కోర్సుల్లో చేరేందుకు సెప్టెంబరు 3వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర దస్తావేజుల భద్రతా కేంద్రంలో ఏడాది పరిశోధన కోర్సు నిర్వహిస్తున్నారు. పీజీ పూర్తిచేసిన వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు www.tamilnaduarchives.tn.gov.in అనే వెబ్ సైట్ సంప్రదించవచ్చు.

విద్యాసంస్థల అనుమతికి అవకాశం

ఐసిఎఫ్, ఆగస్టు 1: విద్యాసంస్థల భవన నిర్మాణాలకు పొందే అవకాశాన్ని వచ్చే ఏడాది జనవరి 31వ తేది వరకు ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్రంలో 2011కు ముందు నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన అనుమతిలేని విద్యాసంస్థల భవనాలకు నమోదుచేసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు అనుమతి పొందని వారు 2025 జనవరి 31వ తేది వరకు టీటీట్ఛిఇఃౌట జజీ అనే వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదుచేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రత్యేక వెబ్‌సైట్

ఐసిఎఫ్, ఆగస్టు1:రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రత్యేక వెబ్‌సైట్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ ప్రారంభించారు. www.tnwomencommission.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో కమిషన్ పనులు, పత్రికా ప్రకటనలు, మహిళా చట్టాలు, సంబంధిత శాఖలను సంప్రదించేందుకు అవసరమయ్యే చిరునామాలను తెలుసుకోవచ్చు. అలాగే, మహిళలు తమ ఫిర్యాదులు నమోదుచేసి కమిషన్ ద్వారా పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

ప్లాట్ల గుర్తింపునకు అవకాశం

ఐసిఎఫ్, ఆగస్టు 1: కొండ ప్రాంతాల్లో అనుమతి లేని స్థలాలను గుర్తించేందుకు ప్రభుత్వం నాలుగు నెలలు అవకాశం కల్పించింది. 2016 అక్టోబరు 20వ తేదీకి ముందు సగం, పూర్తిగా విక్రయించిన అనుమతి లేని ప్లాట్లు గుర్తించి, నవంబరు 30వ తేదిలోపు వాటిని సక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం స్థలం కొనుగోలుదారులు www.tnlayouthillarea-reg.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

బేకరీ వస్తువుల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో బేకరీ వస్తువుల తయారీపై శిక్షణా తరగతులు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే తరగతుల్లో బేకరీ వస్తువుల ముడిపదార్థాలు, బ్రాండ్లు, పరికరాలు, యంత్రాలు, ఉపకరణాల పనితీరు, హైదరాబాద్ కరాచీ బిస్కెట్, స్వీట్ కుకీలు, బాంబే బన్, పఫ్స్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. 18 ఏళ్ల పైబడిన టెన్త్ చదువుకున్న వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 86602600, 7010143022 నెంబర్లు సంప్రదించవచ్చు.

మెట్రో రైళ్లలో 95.35 లక్షల మంది పయనం

పెరంబూర్, ఆగస్టు 1: నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో జూలైలో 95.35 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) గురువారం విడుదల చేసిన ప్రకటనలో... మెట్రోరైలు ప్రయాణికుల భద్రత, రక్షణ, వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. గత నెల 1 నుంచి 31వ తేది వరకు 95,35,019 మంది మెట్రోరైళ్లలో ప్రయాణించారని, 12వ తేది ఒక్కరోజే అధికంగా 3,50,545 మంది ప్రయాణించారని తెలిపింది. జూన్ నెలతో పోల్చితే మెట్రో ప్రయాణికుల సంఖ్య 11,01,182 లక్షలకు పెరిగిందని సీఎంఆర్ఎల్ తెలిపింది.

14 జిల్లాల్లో కాలుష్య నియంత్రణ పనులు

ఐసిఎఫ్, ఆగస్టు 1: రాష్ట్రంలోని 14 జిల్లాల్లో సముద్రతీరాల్లో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టణం, తంజావూరు, పుదుకోట, రామనాధపురం, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో సముద్రతీరాల్లో పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించేందుకు అటవీ, పర్యావరణ శాఖ చర్యలు చేపట్టింది. రూ.100 కోట్లతో ఈ ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ కేంద్రాలు, చేపల వలల సేకరణ కేంద్రాలు వంటివి ఏర్పాటుచేయనున్నారు. ఇందుకయ్యే నిధులు ప్రపంచ బ్యాంక్ అందజేస్తుందని అధికారులు తెలిపారు.

11వ తేది వరకు రహదారుల్లో పారిశుధ్య పనులు

ఐసిఎఫ్, ఆగస్టు 1: నగరంలోని ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులు ఈ నెల 11వ తేది వరకు చేపట్టనున్నట్లు చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు. గత నెల 22 నుంచి స్వచ్ఛ పనులు, రోడ్డు పక్కన ఉన్న వాహనా ల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 4.58 లక్షల కిలోల చెత్త, 37.03 లక్షల కిలోల భవన నిర్మాణ వ్యర్థాలు మొత్తం 41.61 లక్షల కిలోల చెత్త తొలగించారు. అలాగే, 688 వాహనాలను రహదారుల నుంచి తొలగించారు. ఈ పనులు ఈ నెల 11వ తేది వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్,ఆగస్టు1:నగరంలోని ఎగ్మూర్,ఆవడి, పెరంబూర్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఆయా ప్రాంతాలపరిధిలో ఉన్న ఉప విద్యుత్ కేంద్రంలో ఉదయం 11గంటలకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో స్థానికులు పాల్గొని, తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

వాణిజ్య సంస్థల్లో స్మార్ట్ మీటర్లు

ఐసిఎఫ్, ఆగస్టు 1: రాష్ట్ర విద్యుత్ బోర్డు 25 వేల వాణిజ్య సంస్థల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో హై టెన్షన్ విభాగంలో 11,000 కర్మాగారాల్లో మాత్రమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ఈ మీటర్లలో ప్రతినెలా రీడింగ్ ఆటోమేటిక్‌గా నమోదవుతోంది. ఆ ప్రకారం, వినియోగదారులు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే విధంగా లో టెన్షన్ విభాగంలో తొలివిడతగా టి.నగర్‌లో 1.42 లక్షల గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం లో టెన్షన్ విభాగంలో 60,000 వాణిజ్య సంస్థలుండగా, వాటిలో 25,000 సంస్థల్లో త్వరలో ఈ మీటర్లు ఏర్పాటుచేయనున్నారు.

చదురగిరికి పోటెత్తిన భక్తులు

పెరంబూర్, ఆగస్టు 1: చదురగిరి ఆలయానికి వెళ్లే భక్తులతో కొండ మార్గం సందడిగా మారింది. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల కొండల్లో చదురగిరి సుందర, చందన మహాలింగం ఆలయం ఉంది. ఈ ఆలయంలో ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి, ప్రదోషం రోజుల్లో భక్తులు వెళ్లి పూజలు చేసేందుకు అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆడి అమావాస్యను పురస్కరించుకొని గురువారం నుంచి ఈ నెల 5వ తేది వరకు ఆలయానికి భక్తులను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. దీంతో, బుధవారం అర్ధరాత్రికే పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు కొండ మార్గంలో వెళ్లేందుకు అనుమతించారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో భక్తులు బసచేసేందుకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. అలాగే, భక్తుల భద్రత దృష్ట్యా సుమారు 100 మంది పోలీసులు, అటవీ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు.



ఆలయానికి వెళుతున్న భక్తులు

ఆడి అమావాస్య సందర్భంగా 1,140 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఆగస్టు 1: వారాంతపు రోజులు, ఆడి అమావాస్య సందర్భంగా శుక్రవారం నుంచి 1,140 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్రవారం 295 అదనపు బస్సులు, శనివారం 325 బస్సులు నడుపనున్నారు. ఇక, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 60 అదనపు బస్సులు మొత్తం 120 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇవి మినహా, శుక్రవారం ఆడి అమావాస్య సందర్భంగా మేల్‌మలయనూరులో భక్తులు అధికంగా వెళ్లడాన్ని దృష్టిలో ఉంచుకొని కిలంబాక్కం నుంచి 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది.

జలాశయం పునరుద్ధరణకు ఒప్పందం

● వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు



పనులు అడ్డుకుంటున్న గ్రామస్తులు

పెరంబూర్, ఆగస్టు 1: చెంగల్పట్టు జిల్లా తిరుపోరూర్ సమీపం ఆలందూర్ జలాశయం పూడికతీత, గట్లు పటిష్ఠతకు టెండర్ల ద్వారా ఒప్పందదారులను ఎంపిక చేశారు. కానీ, సదరు ఒప్పందదారు జలాశయంలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ గురువారం గ్రామస్తులు, పూడికతీత పనులు చేపట్టిన ఎక్సకవేటర్లు, లారీలను అడ్డుకొని నిలిపివేశారు. 20 నుంచి 30 అడుగుల వరకు గుంతలు తవ్వితే, వ్యవసాయంతో పాటు గ్రామ సమీపంలోని అడవుల్లో నివసించే పక్షులు, జంతువులకు నీరు లేకుండా పోతుందని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తులతో రెవెన్యూ అధికారులు చర్చలు జరుపుతున్నారు.

11 జిల్లాలకు పర్యవేక్షణ అధికారుల నియామకం

పెరంబూర్, ఆగస్టు 1: రాష్ట్రంలో 11 జిల్లాలకు పర్యవేక్షణ అధికారులను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, తిరుపత్తూర్, దిండుగల్, చెన్నై, తిరువణ్ణామలై, తూత్తుకుడి, కళ్లకుర్చి, తిరుప్పూర్, కోవై, పుదుకోట, నామక్కల్, నాగపట్టణం తదితర 11 జిల్లాలకు పర్యవేక్షణ అధికారులు నియమితులయ్యారు. ఆయా జిల్లాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయడం, ప్రజలకు అందించే సంక్షేమ సహాయాల పంపిణీ తదితరాలను వీరు పర్యవేక్షించనున్నారు. అలాగే, విపత్తుల సమయాల్లో కలెక్టర్లతో కలిసి, ఆయా జిల్లాల్లో సహాయక పనుల్లో వీరు పాల్గొంటారని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది.

ఎస్ఈటీసీలో డైలీ కార్మికుల వేతనం పెంపు

పెరంబూర్, ఆగస్టు 1: రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ)లో పనిచేస్తున్న దినసరి కార్మికులకు కనీస వేతనంగా రూ.882 చెల్లించనున్నట్లు చేసిన ప్రకటనపై కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్ఈటీసీ ఆధ్వర్యంలో దూరప్రాంతాలకు పెద్దసంఖ్యలో బస్సులు నడుపుతున్నారు. ఈ సంస్థలో కార్మికుల కొరత కారణంగా దినసరి, కాంటాక్ట్ ప్రాతిపదికన కార్మికులను పనుల్లోకి తీసుకుంటున్నారు. వారికి కనీస వేతనంగా రూ.535 అందజేస్తున్నారు. వేతనం పెంచాలని కోరుతూ సీఐటీయూ సహా పలు కార్మిక సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ప్రభుత్వం, డ్రైవర్లు, కండక్టర్లుగా పనిచేసే టీసీసీ ఉద్యోగులు, టెక్నికల్ ఉద్యోగులకు వేతనాలు సవరించింది. ఆ ప్రకారం, టీసీసీ ఉద్యోగులకు రూ.882, టెక్నికల్ ఉద్యోగులకు రూ.872 చెల్లించనున్నట్లు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాలను కూల్చివేసిన వారిపై చర్యలు

● వ్యాపారుల సంఘం సమాఖ్య డిమాండ్

అడయార్, ఆగస్టు 1: స్థానిక తిరువొత్తియూరులోని వీధుల్లో ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా దుకాణాలను కూల్చివేసిన చెన్నై నగర పాలక సంస్థ అధికారులపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు వ్యాపారుల సంఘ సమాఖ్య డిమాండ్ చేసింది. ఇదే విషయంపై ఆ సమాఖ్య ప్రధాన కార్యదర్శి సౌందర్‌రాజన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక తిరువొత్తియూరు, కాలడిపేట, సన్నిధి వీధి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు బుధవారం రాత్రి దుకాణాలు మూసివేసి ఇంటికి వెళ్ళిన తర్వాత అర్ధరాత్రి సమయంలో కార్పొరేషన్ అధికారులు ఆ దుకాణాలను కూల్చివేయడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా, సంబంధిత దుకాణాల యజమానులకు సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. దీనికి కారణమైన కార్పొరేషన్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

శనివారం పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

వేళచ్చేరి, ఆగస్టు 1: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శనివారం పనిచేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు కార్యాలయాలు పనిచేయనున్నాయి. సెలవు రోజైనా కార్యాలయాలు పనిచేస్తుండడంతో రిజిస్ట్రేషన్ ఫీజు అదనంగా వసూలు చేయాలని కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మూడు క్రిమినల్ చట్టాలకు ఆంగ్లంలో పేరు పెట్టాలంటూ పిటిషన్

● కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, ఆగస్టు 1: హిందీ పేర్లు పెట్టిన మూడు క్రిమినల్ చట్టాలకు ఆంగ్లంలో పేర్లు పెట్టాలంటూ దాఖలైన కేసుపై నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని కేంద్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. భారతీయ శిక్షా స్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్, భారతీయ సాక్షుల చట్టం పేర్లను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధిత్యంగా పేరు మార్చారు. ఈ చట్టాలు వివిధ సవరణలతో జూలై 1వ తేది నుంచి దేశంలో అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, కాంచీపురానికి చెందిన రైతు జీవన్‌కుమార్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ కొత్త చట్టాలకు హిందీలో పేర్లు పెట్టడం చట్టవిరుద్ధమని, కొత్త చట్టాలకు ఆంగ్లంలో పేర్లు పెట్టాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం, పార్లమెంటుకు సంబంధించిన అన్ని సూచనలు తప్పనిసరిగా ఆంగ్లంలో ఉండాలి. కానీ, అందుకు విరుద్ధంగా ఈ మూడు చట్టాలు హిందీలో ఉన్నాయి. కొత్త క్రిమినల్ చట్టాల పేర్లను అర్థం చేసుకోవడంలోనే కాకుండా ఉచ్చరణలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అందువల్ల దేశ ప్రజలందరికీ అర్థమయ్యేలా ఈ చట్టాలను ఆంగ్లంలో మార్చాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసును హైకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి డి.కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి కె. కుమరేశ్‌బాబుతో కూడిన ధర్మాసనం గురువారం విచారించి, ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాలో ఉంచాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడేది లేదు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, ఆగస్టు 1: ప్రాణం పోయినా ఇకపై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తేల్చి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో అన్నామలై రోజుకు ఐదు సార్లు మీడియా ప్రతినిధులతో మాట్లాడేవారు. అంటే ప్రచారానికి బయల్దేరే సమయంలో ఒకసారి, ప్రచారం మధ్యలో ఒకసారి, ముగిసిన తర్వాత ఒకసారి, విమానాశ్రయంలో దిగిన సమయంలో ఒకసారి, విమానంలో ఎక్కేముందు ఒకసారి మీడియాతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోవడంపై ఆ పార్టీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్, అన్నామలై మధ్య చోటుచేసుకున్న మాటల యుద్ధం ఢిల్లీలోని పార్టీ పెద్దల వరకు వెళ్లింది. ఆ తర్వాత బీజేపీ అధిష్ఠానం వీరిద్దరిని తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఆ తర్వాత ఇటీవల కోవై విమానాశ్రయంలో అన్నామలై ని మీడియా పలకరించగా, ఇకపై ప్రాణం పోయినా మీడియాతో మాట్లాడనని, పార్టీ కార్యాలయంలో మాత్రమే మాట్లాడతానంటూ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో, గురువారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లేందుకు చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న అన్నామలైను ఓ మీడియా ప్రతినిధి పలుకరించగా, ఎయిర్‌పోర్ట్‌లో ఇకనుంచి మీడియాతో మాట్లాడను అని చెప్పి వెళ్లిపోయారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



ఆటోలో వదిలివెళ్లిన నగలు పోలీసులకు అప్పగిస్తున్న బెంజిమెన్

పెరంబూర్, ఆగస్టు 1: ప్రయాణికులు ఆటోలో వదలివెళ్లిన నగలను పోలీసులు అందజేసిన ఆటో డ్రైవర్ నిజాయితీని పలువురు ప్రశంసించారు. ఎలిఫెంట్ గేట్, మాధవరం వీఆర్టీ నగర్‌కు చెందిన దీప (23) తన 5 సవర్ల పాత నగ మార్చు కొనేందుకు 'రాపిడో' ఆటోలో షావుకారుపేట వెళ్లింది. అక్కడ దిగిన ఆమె నగ ఉన్న బ్యాగును ఆటోలో మరచి పోయింది. దుకాణానికి వెళ్లి చూడగా బ్యాగు కనిపించకపోవడంతో ఎలిఫెంట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై రాపిడో వినియోగదారుల సేవా కేంద్రంతో సంప్రదించారు. ఆటో డ్రైవర్ బెంజిమెన్‌ను పోలీసులు ఫోన్ చేయడంతో, బెంజిమెన్ తన ఆటో వెనుక సీటు మధ్యలో పడిన బ్యాగును గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు.

మహిళకు లయన్స్ క్లబ్ సాయం



మహిళకు కృత్రిమ చేయి అందిస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

పెరంబూర్, ఆగస్టు 1: ప్రమాదంలో చేయి కోల్పోయిన మహిళను గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ ఆదుకుంది. పమ్మల్ సమీపం పొలిచ్చలూరు అన్నదాన సాయిబాబా ఆలయంలో జరిగిన కార్యక్రమానికి పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ 324-ఎం జిల్లా అధ్యక్షుడు లయన్ పీఆర్ఎస్ శరవణరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై చేయి కోల్పోయిన మహిళకు కృత్రిమ చేయి అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లయన్ ఎస్‌తఈ మోహన్‌బాబు, గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ నిర్వాహకులు లయన్ ఎస్.కన్నన్, లయన్ ఎం.అన్నామలై, కె.మునుస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

ఆలిండియా కోటాలో 851 ఎంబీబీఎస్ సీట్లు

అడయార్, ఆగస్టు 1: జాతీయ స్థాయిలో వైద్య కోర్సుల ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా, తమిళనాడు రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం తమిళనాడు మెడికల్ కౌన్సిల్ చర్యలు చేపట్టింది. అయితే, కేంద్రం అమల్లోకి తెచ్చిన చట్టం మేరకు రాష్ట్రంలోని వైద్య కాలేజీల్లో అఖిల భారత కోటా (ఏఐక్యూ) పరిధిలోని 851 సీట్లను అప్పగించింది. మే నెలలో జరిగిన నీట్‌కు రాష్ట్ర నుంచి 1.25 లక్షల మంది హాజరుకాగా 80 వేలకు మందికిపైగా అర్హత సాధించారు. రాష్ట్ర కోటాలో 8,199 ఎంబీబీఎస్ సీట్లు, 2,162 బీడీఎస్ సీట్లున్నాయి. అఖిల భారత కోటాలో 851 సీట్లు, బీడీఎస్‌లో 38 సీట్లు చొప్పున కేటాయించారు. రాష్ట్రంలోని మొత్తం 36 వైద్య కాలేజీల్లో 15 శాతం సీట్లను అఖిల భారత కోటాకు రాష్ట్ర వైద్య శాఖ కేటాయించింది.

సుప్రీం కోర్టు తీర్పు టామ్స్ పోరాటానికి ఫలితం

● గొల్లపల్లి ఇశ్రాయేలు



వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్న గొల్లపల్లి ఇశ్రాయేలు, విజయకుమార్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 1: రాష్ట్రంలో స్థిరపడిన అరుంధతీయులు విద్య, ఉద్యోగ అవకాశాల్లో లబ్ధిపొందేలా 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు మంచి ఫలితం ఇచ్చిందని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు పేర్కొన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ నుంగంబాక్కంలోని జనోదయం కార్యాలయ ప్రాంగణంలో సంబరాలు జరుపుకున్నారు. టామ్స్ అధ్యక్షుడు నేలటూరు విజయకుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలు ప్రాంతాల్లోని టామ్స్ నిర్వాహకులు పాల్గొనగా వారికి స్వీట్లు పంచి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి ఇశ్రాయేలు మాట్లాడుతూ... ఎస్సీవర్గాలకు ప్రభుత్వం కల్పించిన 18 శాతం రిజర్వేషన్‌లో 3 శాతం అరుంధతీయులకు వర్తింపజేయాలని టామ్స్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పాటు అహింసా మార్గంలో పోరాటాలు చేసిందన్నారు. 2009లో అప్పటి డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కరుణానిధి టామ్స్ కోరికపై స్పందించి అరుంధతీయులకు 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించారని, ఆయన బాటలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా తమ వర్గాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంపై హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేశారు. టామ్స్ కృషిని అభినందిస్తూ పలువురు నేతలు మాట్లాడారు. నేలటూరు విజయకుమార్, ఊటుకూరు దేవదానంల జన్మదినం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో స్వర్ణ జయపాల్, అద్దంకి బిజయ్య, ఆవడి ఇశ్రాయేలు, బాలాజి, రోశయ్య, పాల్ కొండయ్య, సీహెచ్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు గురైన బాలుడి ఆచూకీ లభ్యం

● ముగ్గురి అరెస్టు

అడయార్, ఆగస్టు 1: వేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నాప్‌కు గురైన బాలుడి ఆచూకీ బెంగళూరులో లభ్యమైంది. బాలుడిని కిడ్నాప్ చేసి విక్రయించేందుకు ప్రయత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వేలూరు జిల్లా పేర్నాంబట్టుకు చెందిన గోవిందన్ భార్య చిన్ను (20) ప్రసవం కోసం వేలూరు ప్రభుత్వం ఆస్పత్రిలో గత నెల 27వ తేదీన చేరారు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో చిన్ను ప్రసవించిన మగబిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. దీనిపె పోలీసులు కేసు నమోదు చేయగా, వేలూరు డీఎస్పీ తిరునావుక్కరసు సారథ్యంలోని ప్రత్యేక పోలీస్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా 40 యేళ్ళ మహిళ పదేళ్ళ బాలుడితో కలిసి ఆస్పత్రికి వచ్చినట్టు గుర్తించారు. ఈ మహిళ చిన్ను వద్దకు వెళ్ళి పసికందును చేతుల్లోకి తీసుకుని ముద్దాడి, ఎవరికీ అనుమానం రాకుండా కిడ్నాప్ చేసినట్టు గ్రహించారు. ఆమెను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఒకటి బెంగళూరు వెళ్ళింది. ఈ బృందం గురువారం ఉదయం బెంగళూరులో ఆ మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఆమె కిడ్నాప్ చేసిన పసికందును కూడా స్వాధీనం చేసుకున్నారు. పైగా, ఆ పసికందును విక్రయించేందుకు మహిళకు అండగా నిలిచిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, పసికందు కిడ్నాప్‌కు గురైన 24 గంటల్లోనే గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

మళ్లీ కస్టడీకి ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు నిందితులు ?

అడయార్, ఆగస్టు 1: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టు చేసిన నిందితుల్లో ఆర్కాడు సురేష్ సహా ఐదుగురిని మళ్ళీ కస్టడీలోకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు సీబీసీఐడీ విచారిస్తున్న విషయం తెల్సిందే. ఈ విచారణలో భాగంగా పొన్నై బాలు అనే నిందితుడిని విచాచించగా అనేక కొత్త విషయాలు వెలుగు చూశాయి. దీంతో ఆర్కాడు సురేష్ సహా పొన్నై బాలు, రాము, హరిహరణ్, శివ అనే వారిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు. వీరిని విచారణ జరిపితే ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి రావొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఇన్‌స్టాలో గంజాతో రీల్స్

● ఇద్దరి అరెస్టు

అడయార్, ఆగస్టు 1: గంజాయి ప్యాకెట్లతో రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నగర శివారు ప్రాంతమైన ముడిచ్చూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయం జోరుగా జరుగుతుందని పోలీసులకు అనేక ఫిర్యాదులు వచ్చాయి. అదేసమయంలో కొన్ని రోజుల క్రితం గంజాయి ప్యాకెట్లతో ఇద్దరు యువకులు ఇన్‌స్టా రీల్స్ రూపొందించారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీనిపై పీర్కాంకరణై పోలీసులు కేసు నమోదు చేసి ఆ ఇద్దరు యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో లక్ష్మి నగర్ ప్రాంతంలోని అడయారు నదిలో దీపక్, చంద్రు ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు.. వారిని చుట్టుముట్టారు. అయితే, పోలీసులను తప్పించుకునే ప్రయత్నంలో వారిద్దరూ 30 అడుగుల ఎత్తు నుంచి కిందపడటంతో చేతులు కాళ్ళు విరిగాయి. ఆ తర్వాత వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పళ్ళికరణి పరిసర ప్రాంతాల్లో గంజాయిని విక్రయించినట్టు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినులు సహా ముగ్గురి మృతి

వేళచ్చేరి, ఆగస్టు 1: నగర శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లా కళాశాల విద్యార్థినులు సహా ముగ్గురు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. హిందుస్తాన్ లా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఐదుగురు విశ్వవిద్యాలయం ప్రాంగణం నుంచి పడూర్ బైపాస్ రోడ్డులో కారులో ఇంటికి బయల్దేరారు. ఆ సమయంలో కారు అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొడుతూ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థినులు, ఒక విద్యార్థి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో విద్యార్థిని, విద్యార్థికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, ఆగస్టు 1: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కొరట్టూర్: అన్నానగర్, టీవీఎస్ నగర్, పల్లతెరు, పద్మావతి నగర్, అన్బు నగర్, ఏవీఎస్ మెయిన్ రోడ్డు.

గోపాలపురం: గౌడియ మఠం వీధి, తేమయప్పన్ వీధి, అమ్మయప్పన్ లైన్, గణపతి కాలని మొదటి వీధి, పొన్నుస్వామి వీధి, లాయడ్స్ రోడ్డు కొంత భాగం, బీసెంట్ రోడ్డు, రామస్వామి వీధి, సదాశివం వీధి, పీవీ కోయిల్ 1 నుంచి 3 వీధులు, గణపతి కాలనీ రెండో వీధి, పుదుపేట గార్డెన్ వీధి, టీటీకే రోడ్డు, కార్న్స్ స్మిత్ రోడ్డు, జైహూర్ నగర్, ఎస్ఎస్ 1,2 వీధులు, అమ్మయప్పన్ వీధి, ముత్తు వీధి, సుందరేశ్వరాలయ వీధి, షణ్ముగం వీధి, రెబోరియల్ వీధి, గోవర్ధన్ వీధి, తాండవరాయన్ వీధి, ఉత్తర గోపాలపురం 1,2 వీధులు, రాయపేట ఇందిరా గార్డెన్, పీటర్స్ రోడ్డు కొంత భాగం, రాయపేట హైరోడ్డు, తిరువిక రోడ్డు, బుద్ధి బేగం వీధి.

తండయార్‌పేట: న్యూ వాషర్‌మెన్‌పేట, నార్త్ టెర్మినల్ రోడ్డు, తిరువొత్తియూర్ హైరోడ్డు కొంత భాగం, దిడీర్ నగర్, చెరియన్ నగర్, సుడలైముత్తు వీధి, అశోక్ నగర్, దేశీయ నగర్, నమ్మయ్య వీధి, బుజమ్మాల్ వీధి, నాగూరాన్ గార్డెన్, బాలకృష్ణ వీధి, ఫిషింగ్ హార్బర్, ధనపాల్ నగర్, వెంకటేశన్ అలి వీధి, వీరరాఘవ వీధి, ఇరుసప్పన్ మేస్త్రి వీధి, పూండి తంగమ్మాల్ వీధి, ఏఈ ఆలయ వీధి, ఆవూర్ ముత్తయ్య వీధి, కాలడి పేట, న్యూ కాలనీ, సంతానపురం, శేషాచల గ్రామణి వీధి, మేట్టు వీధి, టీహెచ్ రోడ్డు కెనరా బ్యాంక్ వరకు, ఎంజీఆర్ నగర్, గౌర వీధి, గ్రామ వీధి వావూసీ నగర్ క్రాస్ రోడ్డు, శివన్ నగర్, మంగమ్మాల్ గార్డన్, జీవా నగర్, ఎంపీటీ క్వార్టర్స్, ఏఈ ఆలయ వీధి.

టీఎన్‌పీఎస్సీ పరీక్షల నియంత్రణాధికారిగా జాన్‌లూయిస్

ఐసిఎఫ్, ఆగస్టు 1: టీఎన్‌పీఎస్సీ పరీక్షల నియంత్రణాధికారిగా జాన్‌లూయిస్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి గోపాలసుందర్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

సుప్రీం తీర్పును స్వాగతించిన ఎమ్మార్పీఎస్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన లోకేష్ కుమార్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తమిళనాడు విభాగం స్వాగతించింది. రాణిపేట జిల్లా అరక్కోణం ఎస్సార్ ప్రాంతంలో ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి తమిళనాడు అధ్యక్షుడు లోకేష్‌కుమార్ నేతృత్వంలో నివాళులర్పించి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌పి ప్రభాకర్, ఎంఎస్ తిరుమలై, ఎస్.రాజన్, ఎస్.లోకనాధన్, తిరువళ్లూర్ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు అరుణాచలం, ఆల్బర్ట్, వి.కుమార్, ఎం.మోహన్, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు, సహాయక చర్యలకు పలువురు సినీ ప్రముఖులు స్పందించి విరాళాలు ప్రకటిస్తున్నారు. అగ్రహీరో కమల్ హాసన్ కేరళ సీఎం సహాయ నిధికి రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని గురువారం ప్రకటించారు.



సూర్య, జ్యోతిక, కార్తీ

కేరళ సీఎం సహాయ నిధికి సూర్య - కార్తీ రూ.50 లక్షల విరాళం

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు హీరో సూర్య - జ్యోతిక దంపతులు, హీరో కార్తీ కలిసి రూ.50 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి వారు అందజేశారు. అదేసమయంలో ఈ ప్రకృతి సృష్టించిన బీభత్సంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుంటుంబాలకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గత నెల 29వ తేదీన వయనాడ్ జల్లాలో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడగా, పలు గ్రామాలు కనిపించకుండా పోయాయి. పలు ప్రాంతాల్లో శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు జరుగుతున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు పలువురు సినీ సెలెబ్రిటీలు పెద్ద మనసుతో స్పందించి విరాళాలు ప్రకటిస్తున్నారు.

చిత్రజ్యోతి

వారం రోజులు ముందుగానే 'అంధగన్' రిలీజ్



'అంధగన్'లో ప్రియా ఆనంద్ - ప్రశాంత్


ప్రశాంత్, ప్రియా ఆనంద్ జంటగా నటించిన 'అంధగన్' చిత్రం వారం రోజులు ముందుగానే విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15వ తేదీన విడుదల చేస్తున్నట్టు తొలుత ప్రకటించారు. అయితే, అదే రోజు పలు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో 'అంధగన్' చిత్రాన్ని ఆగస్టు 9వ తేదీ విడుదల చేయనున్నట్టు హీరో ప్రశాంత్ తన ట్విటర్ ద్వారా అధికారికంగా వెల్లడించారు. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో అయుష్మాన్ ఖురానా, టబు తదితరులు నటించిన బాలీవుడ్ మూవీ 'అంధాధున్' మూవీని దర్శక నిర్మాత త్యాగరాజన్ తమిళంలోకి రీమేడ్ చేశారు. స్టార్ మూవీస్ పతాకంపై ప్రశాంత్, ప్రియా ఆనంద్, వనిత, ఊర్వశి, సముద్రఖని, కేఎస్ రవికుమార్, మనోబాల, సిమ్రాన్, కార్తీక్, యోగిబాబు తదితరులు నటించారు. ఎపుడెపుడా అని ఎదురు చూస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్ర బృందం తాజాగా రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చిన విషయం తెల్సిందే.

నేడు తమిళ నిర్మాతల సంఘం అత్యవసర సమావేశం

TAMIL FILM PRODUCERS COUNCIL

తమిళ చలనచిత్ర నిర్మాతల సంఘ కార్యవర్గం అత్యవసర సమావేశం శుక్రవారం నగరంలో జరుగనుంది. హీరో ధనుష్ ముందస్తుగా అడ్వాన్సు తీసుకుని, నిర్మాతలకు సహకరించడం లేదని, అందువల్ల ఆయనతో కొత్తగా సినిమాలు నిర్మించవద్దంటూ తాజాగా నిర్మాతల సంఘం ఒక తీర్మానం చేసింది. దీనిపై నడిగర్ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం ఒక్క ధనుష్‌నే లక్ష్యంగా చేసుకుని తీర్మానం చేయడం సబబు కాదని, ఈ విషయంపై తమతో చర్చించకుండా ఎలా తీర్మానం చేస్తారంటూ నడిగర్ సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో నిర్మాతల సంఘ కార్యవర్గ అత్యవసర సమావేశం శుక్రవారం జరుగనుంది. ఇందులో నటీనటుల పారితోషికం, నానాటికీ పెరిగిపోతున్న నిర్మాణ వ్యయం తదితర అంశాలపై చర్చించనున్నారు. అలాగే, ఇటీవల విడుదల చేసిన ప్రకటనలోని పలు అంశాలపై మళ్ళీ చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.

చెక్కు మోసం కేసు ... 4 వారాల్లో రూ.1.1 కోట్లు డిపాజిట్ చేయాలి



● 'కొచ్చడియాన్' నిర్మాతకు హైకోర్టు ఆదేశం

చెక్కు మోసం కేసులో నాలుగు వారాల్లో రూ.1.1 కోట్లను డిపాజిట్ చేయాలని మద్రాస్ హైకోర్టు 'కొచ్చడియాన్' నిర్మాతను ఆదేశించింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'కొచ్చడియాన్' యానిమేషన్ చిత్రానికి ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వం వహించారు. మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మించింది. అయితే, సినిమా నిర్మాణం కోసం యాడ్ బ్యూరో అడ్వర్‌టైజింగ్ నుంచి మీడియాన్ సంస్థ రూ.10 కోట్లు రుణంగా తీసుకుంది. ఈ సినిమా విడుదలైన తర్వాత తమిళనాడు రిలీజ్ రైట్స్‌తో పాటు తమిళనాడులోని కలెక్షన్ మొత్తంలో 20 శాతం యాడ్‌బ్యూరోకిచ్చేలా రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ అగ్రిమెంట్‌ను ఉల్లంఘించడమేకాకుండా, బ్యాంకు రుణం చెల్లించేందుకు ఇచ్చిన రూ.5 కోట్ల చెక్కు ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారంటూ మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ, డైరెక్టర్ మురళీ మనోహర్‌లపై యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అభిర్‌చంద్ నహర్ చెన్నై అల్లికుళం కోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన అల్లికుళం కోర్టు... మురళీ మనోహర్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.7.70 కోట్ల నష్టపరిహారం అభిర్‌చంద్‌కు చెల్లించాలంటూ ఆదేశించింది. ఈ తీర్పుపై మురళీ మనోహర్ హైకోర్టులో అప్పీల్ చేయగా, కింది కోర్టు విధించిన జైలు శిక్షను నిలిపివేసింది. ఆ తర్వాత ఈ పిటిషన్‌పై పలుమార్లు విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోమారు విచారణకు రాగా, ఇప్పటివరకు మొత్తం రూ.8.99 కోట్లను తిరిగి చెల్లించినట్టు కోర్టుకు తెలిపారు. దీంతో మిగిలిన రూ.1.1 కోట్లను నాలుగు వారాల్లోగా తిరిగి చెల్లించాలంటూ తాజాగా ఆదేశించింది.

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కు చెందిన చెత్త సేకరించే వాహనాలు, ప్రొక్లయిన్లు, పాప్‌కాట్, మెకానిక్ స్వీపర్ తదితర వాహనాలను, డ్రైవర్లు సక్రమంగా వినియోగించడం లేదని జీసీసీ కమిషనర్ కుమరుగురుబరన్ పరిశీలనలో వెలుగుచూసింది. దీంతో, అన్ని వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. జీసీసీ పరిధిలో ప్రతిరోజూ భారీగా చెత్త సేకరిస్తున్నారు. వాటితో ఎరువులు, గ్యాస్ ఉత్పత్తి, రీ సైక్లింగ్‌కు వినియోగం తదితరాలకు పోగా, మిగిలిన చెత్తను పెరుంగుడి, కొడుంగైయూర్ ప్రాంతాల్లో ఉన్న డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తుంటారు.

\- పెరంబూర్





డ్రైవర్ విధుల్లో నిర్లక్ష్యానికి చెక్

జీసీసీ వాహనాలకు జీపీఎస్ పరికరం

10 మండలాలు ప్రైవేటు సంస్థకు...



జీసీసీ పరిధిలో 10 మండలాల్లో ప్రైవేటు సంస్థలు, ఐదు మండలాల్లో కార్పొరేషన్ చెత్త సేకరణ చేపడుతోంది. చెత్త సేకరణలో 2,287 ప్రైవేటు వాహనాలు వినియోగిస్తున్నారు. అలాగే, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త సేకరణతో పాటు పలు పనులకు 2,886 వాహనాలు వినియోగిస్తున్నారు. లారీలు, బ్యాటరీ వాహనాలు, ప్రొక్లయినర్లు, పశువులు, కుక్కలను బంధించే వాహనాలు నడిపేందుకు 400 మంది పర్మినెంట్ డ్రైవర్లను నియమించింది. అలాగే, ఒప్పంద పద్ధతిలో కూడా డ్రైవర్లు పనిచేస్తున్నారు. వాహనాలకు మరమ్మతులు, పర్యవేక్షణకు కార్పొరేషన్, ప్రైవేటు సంస్థలకు వేర్వేరు డిపోలున్నాయి. ఈ క్రమంలో, అధికారుల వాహనాలు తప్ప, మిగిలిన వాహనాలు క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి.

కమిషనర్ పరిశీలన...

జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్ ఇటీవల పలు ప్రాంతాల్లో పర్యటించి వాహనాల పనితీరు పర్యవేక్షించారు. నిర్మాణ వ్యర్థాలు తొలగించే వాహనాలు, కాలువల్లో పూడికతీత చేపట్టే వాహనాలు సక్రమంగా పనిచేయడం లేదని గుర్తించారు. అదే సమయంలో, రికార్డుల్లో అన్ని వాహనాలు పనిచేస్తున్నట్లుగా ఉంది. ప్రత్యామ్నాయ పనులకు వాహనాలు వినియోగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, నగరంలో డ్రైనేజీ కాలువ, తాగునీరు, సీవరేజ్ ప్రాజెక్ట్, పవర్ కేబుల్, టెలికం కేబుల్, గ్యాస్ పైప్‌లైన్, మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయని, అందువల్ల మట్టి, చెత్త తదితర వ్యర్థాలు డ్రైనేజీల్లో చేరుకపోయాయి. ఈ వ్యర్థాలు సత్వరం తొలగించే పనులు జరగడం లేదు. కొందరు చేసే తప్పుకు నగరంపై ప్రభావం చూపుతుందని కమిషనర్ అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. వాహనాలకు సకాలంలో మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం, డ్రైవర్లు సక్రమంగా విధులకు రాకపోవడం, ఆలస్యంగా విధులకు వచ్చిన డ్రైవర్లు, రోడ్డు పక్కన చెట్ల నీడన వాహనాలు నిలిపి నిద్రపోవడం, డీజిల్, వాహనాల విడిభాగాలు చోరీకి గురవుతున్నట్లు ఫిర్యాదులందాయి. కొన్నేళ్ల క్రితం వాహనాలకు జీపీఎస్ అమర్చారు. కానీ, డ్రైవర్లు వ్యతిరేకించడం, కావాలని మరమ్మతులకు గురిచేయడం తదితరాలతో వాటిని తొలగించారు. ఆ తర్వాత 10 మండలాల్లో చెత్త సేకరణ బాధ్యత ప్రైవేటుకు అప్పగించారు. ప్రారంభ దశలో ప్రైవేటు వాహనాలకు జీపీఎస్ పరికరం అమర్చగా, ప్రస్తుతం అవి సక్రమంగా పనిచేయడం లేదని ఫిర్యాదులందాయి. అలాగే, కార్పొరేషన్‌కు చెందిన కొందరు డ్రైవర్లు, విధుల్లో ఉన్నట్లు రిజిస్టర్‌లో సంతకం చేసి, ఇళ్లకు వెళ్లిపోతున్నారు. వారు నడపాల్సిన ప్రొక్లయిన్లు, లారీలు ఆగిపోయి, డ్రైనేజీ కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు, పశువులు, కుక్కలు బంధించడం తదితరాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. కార్పొరేషన్ పరిధిలోని వాహనాలు సక్రమంగా నడిచేలా, ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరం ఏర్పాటుచేయాలని, రిప్పన్ భవనంలోని కంట్రోల్ రూం నుంచి ఆ వాహనాలను పర్యవేక్షించాలనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవసరమైతే, కమిషనర్ సహా అధికారులు తమ సెల్‌ఫోన్ ద్వారా పర్యవేక్షించే సౌకర్యం కూడా ఏర్పాటుకానుంది.

డ్రైవర్ల ఇష్టారాజ్యం...

కార్పొరేషన్‌లో కొందరు పర్మినెంట్ డ్రైవర్లు కార్పొరేటర్ల పేర్లు చెప్పి సంతకం చేసి విధులు హాజరుకావడం లేదు. అధిక వేతనం పొందే కొందరు డ్రైవర్లు, ఇతరులను తమ వాహనాలకు డ్రైవర్లుగా పంపి వారు ఇతర పనులు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. అందువల్ల కార్పొరేషన్ పనులు సక్రమంగా జరగడం లేదు. అదే సమయంలో విధులు సక్రమంగా నిర్వహించే డ్రైవర్లు ఎక్కువ గంటలు పనిచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైవర్లు తమ విధులు సక్రమంగా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ పరిధిలోని వాహనాలు...	
బ్యాటరీ వాహనాలు	:2,110
కంపాక్టర్ లారీలు	:142
టిప్పర్	:112
మెకానిక్ స్వీపర్	:20
బీచ్ శుభ్రం చేసే వాహనాలు	:8
తాగునీటి వాహనాలు	:22
టాయిలెట్ వాహనాలు	:15
అధికారుల వాహనాలు	:202
చిన్నరకం వాహనాలు	:65
ఇతర వాహనాలు	:190

ప్రైవేటు సంస్థల పనితీరుపై అసంతృప్తి...

జీసీసీ పరిధిలోని పది మండలాల్లో చెత్తసేకరణ పనులను ప్రైవేటుకు అప్పగించారు. కానీ, ప్రైవేటు వాహనాలు అధికంగా అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, మాల్స్ తదితరాల్లో చెత్త సేకరణకు ప్రాధాన్యత చూపుతుండడంతో, అంతర్గత రోడ్లు, చెల్ల కుండీల్లో సక్రమంగా చెత్త సేకరించడం లేదు. ఈ విషయమై ఇటీవల జరిగిన జీసీసీ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు.

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

● నటి శరణ్య



శరణ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలతోనే పిల్లలు ఆరోగ్యంగా వుంటారని ప్రముఖ సినీ నటి శరణ్య పొన్‌వన్నన్ పేర్కొన్నారు. పోరూర్‌లో వున్న 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో గురువారం తల్లిపాల వినియోగంపై అవగాహనా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించిన శరణ్య మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన పిల్లలకు తల్లిపాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత వివరించారు. తనకు సిజేరియన్ డెలివరీ అయినప్పటికీ తల్లి పాలు ఇవ్వాలని వైద్యులు, నర్సులు ప్రేరేపించారని గుర్తు చేసుకున్నారు. ఈరోజు తన కుమార్తెలిద్దరూ డాక్టర్లుగా వున్నారని, తల్లిపాల వలనే వారు ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్ మాట్లాడుతూ.. తల్లిపాలు ఇవ్వడం ఇప్పుడు చాలా అరుదుగా మారిందని, తల్లిపాలు ఒక్కటే సరిపోతుందా అనే సందేహం చాలామంది తల్లులకు వుందని వివరించారు. మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్ మాట్లాడుతూ.. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లతా రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

ఎస్కేపీసీలో ఉత్సాహంగా అంతర్ విభాగాల పోటీలు

ప్యారీస్, ఆగస్టు 1: స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ) ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్ విభాగాల పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ వేడుకలకు ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ అధ్యక్షత వహించగా, తెలుగు అధ్యాపకురాలు డా.మైథిలి, కో-ఆర్డినేటర్ డా.బి.భరణికుమారి పోటీలను పర్యవేక్షించారు. ముఖ్యఅతిథులుగా దుర్గా స్రవంతి సభ్యురాలు డా.దామెర్ల పద్మావతి, ఐకేఏఎస్ టెక్నాలజీస్ డైరెక్టర్ శోభారాజా పాల్గొన్నారు. పలు పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చూపారు. మరి కొంతమంది జానపద నృత్యాలతో అలరించారు. వివిధ రంగుల విశిష్టతపై ప్రసంగించారు. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ విద్యార్థుల ప్రతిభను కొనియాడి విజేతలకు బహుమతి ప్రదానం చేసి అభినందించారు. తెలుగు మీడియం విద్యార్థినులు మాతృభాష సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించేందుకు తమవంతు కృషిచేయాలని అతిథులు పిలుపునిచ్చారు.

ఊటీ కొండ రైలు సేవల రద్దు

● నిరాశగా వెనుదిరిగిన పర్యాటకులు



ప్యారీస్, ఆగస్టు 1: నీలగిరి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో మట్టిచెరియలు, రాళ్లు విరిగిపడ్డాయి. ముఖ్యంగా అడర్లీ-హిల్‌గ్రోవ్ రైల్వేస్టేషన్ల మధ్య మట్టిచెరియలు, చెట్టు కొమ్మలు విరిగిపడి రైలుపట్టాలు ధ్వంసమయ్యాయి. అందువల్ల ఊటీ కొండ రైలు సేవలను గురువారం రద్దు చేశారు. మేట్టుపాళయం రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 7.10 గంటలకు 184 మంది ప్రయాణికులతో ఊటీకి కొండ రైలు బయల్దేరింది. ఆ సమయంలో అడర్లీ-హిల్‌గ్రోవ్ స్టేషన్ల మధ్య రైలుపట్టాలు ధ్వంసమైన విషయం తెలుసుకున్న అధికారులు, ఆ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టారు. దీంతో ఊటీ కొండ రైలును కల్లారు రైల్వే స్టేషన్‌లో నిలిపివేసి, మళ్లీ అక్కడి నుంచి మేట్టుపాళయం మళ్లించారు. అనంతరం మేట్టుపాళయం నుంచి ఊటీ వరకు నడిపే కొండ రైలును ఒకరోజు మాత్రం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు టిక్కెట్టు డబ్బు పూర్తిగా తిరిగి చెల్లించారు. కొండ రైలు రద్దు కావడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.

33.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

● సహకార శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్



ఉద్యోగులు, రైతుల సమస్యలు తెలుసుకుంటున్న రాధాకృష్ణన్

పెరంబూర్, ఆగస్టు 1: రాష్ట్రంలో ఇప్పటి వరకు 33.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులు చేసినట్లు ఆహార, సహకార శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్ తెలిపారు. గురువారం తంజావూరు పిల్లయార్‌పట్టిలోని గోడౌన్‌లోని ధాన్యం బస్తాలను పరిశీలించిన రాధాకృష్ణన్, అక్కడి ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర రైతులు తాము పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లభిస్తుండడంతో సహకార శాఖ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయిస్తున్నారని తెలిపారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో ఇప్పటివరకు 33.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, గత ఏడాది 42 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన నేపథ్యంలో, పలు కారణాలతో ఉత్పత్తి, కొనుగోళ్లు తగ్గాయన్నారు. ఈ నెలాఖరుకు మరో 4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశముందని తెలిపారు. అలాగే, రాష్ట్రంలో 3.63 లక్షల టన్నుల బియ్యం అందుబాటులో ఉందన్నారు. ఇక, రాష్ట్రంలో సహకార శాఖ ఆధ్వర్యంలో 36,954 రేషన్ దుకాణాలున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.24 కోట్ల రేషన్‌కార్డులుండగా, కొత్త రేషన్ కార్డులు కోరుతూ 2.8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. డెల్టాకు సాగు నీరు విడుదల చేసినట్లు, రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు తగిన సమయంలో అందించేలా చర్యలు చేపట్టామని రాధాకృష్ణన్ తెలిపారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ పి.ప్రియాంక పంకజం, అధికారులు ఉన్నారు.



చెన్నై సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీఎన్‌పీఎస్సీ ద్వారా కో-ఆపరేటివ్ శాఖలో కొత్తగా ఎంపికైన 780 మందికి నియామక పత్రాలు అందజేసి, వారితో ఫొటో దిగిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి ఉదయనిధి



అడయార్, ఆగస్టు 1: రాష్ట్ర మంత్రి ఉదయనిధి విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని ఆరగించారు. తిరుచ్చి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన గురువారం అందనల్లూరు యూనియన్ తిరుప్పరాయ్‌దురై గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని తనిఖీ చేశారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని ఆరగించారు. ఆ తర్వాత తిరుచ్చి జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి, పలువురు లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. అలాగే, జేఈఈలో ఉత్తీర్ణత సాధించి తిరుచ్చి ఎన్ఐటీలో సీటు సంపాదించిన రోహిణి అనే విద్యార్థిని ఇంటికి వెళ్ళి ఆమెతో మాట్లాడారు. మంత్రి ఉదయనిధి వెంట పలువురు ఉన్నతాధికారులు, స్థానిక డీఎంకే నేతలున్నారు.

చెన్నై సచివాయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు సంప్రదాయ బంధాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 15 రోజులు శిక్షణకు వచ్చిన దక్షిణాఫ్రికా, ఉగాండా, ఇండోనేషియా, మారిషస్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలకు చెందిన 100 తమిళ పరిశోధన విద్యార్థులతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రి సెంజి మస్తాన్ తదితరులు

